క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 60-70, పచ్చిమిర్చి 60-70 , బెండ 40, కాకర 55, దొండ 35, దోస 35, ఆలు 25, చామ 45, కీర 30, బీర 50, వంకాయ 40, గోకర 45, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 55, చిక్కుడు 70, ఉల్లి 30 (1 కేజీ), ములక్కాయలు (3) 10 ,క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 200-250, వెల్లుల్లి 200.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్, మదీనాగూడ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- ఆదిత్య ఇంపీరియల్ హైట్స్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, వినాయక నగర్, ప్రకాష్‌నగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు.
- ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలో .. మధ్యాహ్నం 02.00 గంటల నుంచి సాయంత్రం 05.00 గంటల వరకు ల్యాండ్ మార్క్ రెసిడెన్సీ, ఆర్టీసీ కాలనీ, జెనిసిస్ స్కూల్, తులసిరాం చాంబర్స్, నైమిషా అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పీజేఆర్ ఫీడర్ పరిధిలోని టెలికాంనగర్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, ఓల్డ్ గచ్చిబౌలి వాది నెంబర్ 1,2,3, రాడిసన్ హోటల్, లీ మెరిడియన్, హెచ్‌ఐజీ, ఎంఐజీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్: మయూరినగర్ ఫీడర్, ప్రశాంత్ నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మయూరీనగర్ ఫీడర్ పరిధిలోని ఎస్‌బీఐ బ్యాంకు లైన్, ఓల్డేజ్ హోమ్ అపోజిట్ ఏరియా, మయూరీనగర్ అదే విధంగా మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రశాంత్‌నగర్, మయూరీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ హరిసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 19 మందికి కొవిడ్ ర్యాపిడ్ ఆంటీజెన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 15 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

సాజిద్ ముంతాజ్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని పరిశోధక విద్యార్థి సాజిద్ ముంతాజ్‌కు బుధవారం పీహెచ్‌డీని ప్రకటించారు. ఉర్దూ విభాగంలో పరిశోధక విద్యార్థి సాజిద్ ముంతాజ్ ' ఉర్దూ గజల్ కే అలమతీ నిజాం కా తంఖీదీ తజ్జియా 1960-1980' అంశంపై థీసిస్‌ను సమర్పించారు. ఆయనను ఫ్యాకల్టీ ప్రతినిధులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

'మనూ'లో రెండు రోజుల సదస్సు

రాయదుర్గం: మనూలో మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్‌పై రెండురోజుల సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎంసీజే విభాగం, ప్రోగ్రామ్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎహ్తెషామ్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని మౌలానా ఆజాద్ చైర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్(ఎంసీజే) సంయుక్త ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో ఈ సదస్సును నిర్వహిస్తామనితెలిపారు. ఈ కార్యక్రమంలో కొలంబియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ షొన్నా రోడ్రిగ్స్, మనూ ప్రొఫెసర్ అజీజ్‌బానో, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ పాల్గొంటారని వివరించారు.

ఫ్యాన్ కోడ్‌పై ప్రాంతీయ లీగ్స్ ప్రసారం

సాక్షి,సిటీబ్యూరో: క్రీడాపోటీలను ప్రసారం చేసే ఆన్‌లైన్ వేదిక ఫ్యాన్ కోడ్.. ప్రాంతీయ క్రికెట్ లీగ్స్‌ను సైతం అందిస్తోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇటీవల తమిళనాడు ప్రీమియర్ లీగ్ (టీఎన్‌పీఎల్), ఉత్తరాఖండ్ ప్రీమియర్ లీగ్, షేర్-ఎ-పంజాబ్ టీ20 ట్రోఫీ, మహారాష్ట్ర ప్రీమియర్ లీగ్‌లను ప్రసారం చేసిందని, ప్రస్తుతం మహారాజా కెఎస్‌సిఎ టీ20 ట్రోఫీని,అదే విధంగా ప్రస్తుతం విశాఖలో జరుగుతున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)ను కూడా అందిస్తున్నామన్నారు. క్రికెట్ ప్రేమికులు తమ మొబైల్, ఆండ్రాయిడ్ టీవీ యాప్‌లతో పాటు పలు మాధ్యమాల ద్వారా ఈ పోటీలను వీక్షించవచ్చునన్నారు.

కబ్జాదారులకు కలిసొస్తున్న జీఓ 59..

శేరిలింగంపల్లిలో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం



టెలికాంనగర్‌లో సంవత్సరం క్రితం రెవెన్యూ అధికారులు కూల్చివేతలు జరిపిన దృశ్యం (ఫైల్)



ఖాజాగూడ సర్వే నంబర్ 40లో గతంలో రెవెన్యూ అధికారులు పాతిన బోర్డు (ఫైల్)

సహకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది, అధికారులు అని ఆరోపణలు

గచ్చిబౌలి: జీఓ 59 కొందరికి వరంగా మారింది. ఈ జీఓ నేపథ్యంలో ప్రభుత్వ స్థలాల్లో రెవెన్యూ యంత్రాంగం గతంలో పాతిన బోర్డులు మాయమవుతున్నాయి. కబ్జాల పరంపర కొనసాగుతండటంతో శేరిలింగంపల్లి రెవెన్యూ యంత్రాంగంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శేరిలింగంపల్లిలో ఏ మూలకు వెళ్లినా చదరపు గజం ధర బహిరంగ మార్కెట్‌లో లక్షన్నరకు పైగానే ఉంది. ప్రధాన రహదారుల వెంట రెండు లక్షలకు పైమాటే. చట్టంలో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకొని, కొందరు రెవెన్యూ సిబ్బంది, అధికారుల తీరుతో రూ. కోట్ల విలువైన స్థలాలకు ముప్పు పొంచి ఉంది. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకుంటే విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యే అవకాశం ఉంది.

రూ.10 కోట్ల విలువైన స్థలానికి రక్షణ కరువు

ఓల్డ్ ముంబై జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గచ్చిబౌలి సర్వే నంబరు 91, టెలికాంనగర్ ఎక్స్‌టెన్షన్ లే అవుట్‌లో కబ్జాల పరంపర కొనసాగుతోంది. శేరిలింగంపల్లి తహసీల్దార్‌గా పని చేసిన విద్యాసాగర్ హయాంలో టెలికాంనగర్ ఎక్స్‌టెన్షన్ లే అవుట్‌లో ప్రభుత్వానికి చెందిన ప్లాట్లకు ప్రహరీ, ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అక్కడ ఒక్క ప్లాట్‌కు కూడా ప్రహరీ లేకపోవడం గమనార్హం.

- సైబరాబాద్ కమిషనరేట్‌ను ఆనుకొని ఓ వ్యక్తి దాదాపు 500 చదరపు గజాల స్థలం కబ్జా చేశారని తెలియడంతో ఏడాది క్రితం రాజేంద్రనగర్ ఆర్డీఓ చంద్రకళ ఆదేశాలతో సదరు స్థలంలో వెలసిన ప్రహరీ, నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేయకుండా కింద స్థాయి రెవెన్యూ అధికారులు లెక్కలు చూసుకోవడంతో ప్రస్తుతం గదులు వెలిశాయి. ఆ స్థలాన్ని క్రమబద్ధీకరించాలని దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం.

ఖాజాగూడలో రూ.20 కోట్ల స్థలానికి ఎసరు

ఖాజాగూడ ప్రధాన రహదారి వెంట చదరపు గజం ధర రెండు లక్షలకు పైమాటే. ఖాజాగూడ సర్వేనంబరు 27/1, 28లో ప్రభుత్వ స్థలం ఉంది. 2017లో 850 చదరపు గజాల స్థలాన్ని మోడల్ మార్కెట్‌కు కేటాయించారు. స్థలం విలువ దాదాపు రూ.20 కోట్లు ఉంటుందని అంచనా. జీహెచ్‌ఎంసీ అధికారులు మోడల్ మార్కెట్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినా డిజైన్ సరిగ్గా లేదని పనులు ప్రారంభించలేదు. ఆ స్థలాన్ని ఆనుకొని ఇళ్లు కలిగిన వ్యక్తి మోడల్ మార్కెట్ కేటాయించిన స్థలాన్ని ఆనుకొని కారు వాష్ ఏర్పాటు చేసి రోడ్డుగా వాడుకుంటూ, మరికొంత స్థలంలో వాటర్ ట్యాంకర్లకు పార్కింగ్‌గా ఉపయోగించుకుంటున్నాడు. ఈ స్థలాన్ని క్రమబద్ధీకరించాలని దరఖాస్తు చేసుకున్నట్టు స్థానికులు చెబుతున్నారు

సర్వే నంబరు 40లో....

ఖాజాగూడ సర్వే నంబరు 40లోని ప్రభుత్వ స్థలంలో నకిలీ డాక్యుమెంట్లతో ఓ వ్యక్తి ఇప్పటికే అనేక చోట్ల కబ్జాలకు పాల్పడి భవనాలు నిర్మించాడు. సంవత్సరం క్రితం సదరు వ్యక్తి చిత్రపురి కాలనీకి వెళ్లే రోడ్డులో రూ.9 కోట్ల విలువైన 600 చదరపు గజాల స్థలాన్ని బండరాళ్లు కొట్టి చదును చేస్తుండగా రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలమని బోర్డు పాతారు. రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, సదరు వ్యక్తిపై కేసు నమోదైంది. కొద్ది రోజులకే రెవెన్యూ సిబ్బంది పాతిన బోర్డు మాయం కావడం గమనార్హం. సదరు స్థలంలో తాజాగా బండరాళ్లను తొలగిస్తున్నారు.అక్కడ చదరపు గజం ధర లక్షన్నరకు పైగా ఉంటుంది. ఇప్పటికైనా ఆయా ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు రెవెన్యూ ఉన్నతాధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

శేరిలింగంపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ స్థలాల కబ్జాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాము. గచ్చిబౌలిలో కబ్జాకు గురైన స్థలం, ఖాజాగూడ సర్వే నంబర్ 27/1లో ప్రభుత్వ స్థలాన్ని కాపాడతాం. ఖాజాగూడ సర్వే నంబర్-40 గతంలో కబ్జాకు యత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. స్థలాన్ని కాపాడేందుకు నోటీసులు జారీ చేసి చర్యలు చేపడతామన్నారు.

– శేరిలింగంపల్లి తహసీల్దార్ శ్రీనివాస్‌రావు



ఖాజాగూడలో మోడల్ మార్కెట్‌కు కేటాయించిన స్థలం ఇదే..



రెవెన్యూ అధికారులు కూల్చివేతలు జరిపిన స్థలంలో వెలిసిన నిర్మాణాలు



రెవెన్యూ అధికారులు బోర్డు పాతిన స్థలంలో బండరాళ్లు పగులగొడుతున్న దృశ్యం

పాలనలో నైతికత చాలా ముఖ్యం

సింగపూర్ ఆర్గనైజేషన్ డెవలప్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు రామకృష్ణన్



సమావేశంలో పాల్గొన్న రామకృష్ణన్, కస్తూరి బాలాజీ ,ఎఫ్‌ఎల్‌ఓ చైర్‌పర్సన్ రీతూషా

రాయదుర్గం: పాలనలో నైతికత చాలా ముఖ్యమని సింగపూర్ ఆర్గనైజేషన్ డెవలప్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్, వి రామకృష్ణన్ పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌ఎల్‌ఓ) ఆధ్వర్యంలో 'విమెన్ ఆన్ ఫ్యామిలీ బోర్డ్స్' అనే అంశంపై ప్రత్యేక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవాబుదారీతనం, చిత్తశుద్ధి, సమర్థత, పారదర్శకత పాలనకు మూల స్తంభాలని పేర్కొన్నారు. 60 ఏళ్ళలో ప్రభుత్వం చేయలేని పనిని కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అంటూ రుద్దడం సరికాదన్నారు. పాల్కివాలా ఫౌండేషన్ ట్రస్టీ కస్తూరి బాలాజీ మాట్లాడుతూ కుటుంబ వ్యాపారాలు జీడీపీకి గణనీయంగా దోహదపడుతున్నాయన్నారు. ఎఫ్‌ఎల్‌ఓ చైర్‌పర్సన్ రీతూషా మాట్లాడుతూ నాయకత్వాన్ని నిర్వచించడం చాలా కష్టమని, మంచి నాయకత్వం మరింత కష్టమని పేర్కొన్నారు. కుటుంబ బోర్డులు చాలా కాలంగా అనేక వ్యాపారాలు, సంస్థలలో నిర్ణయం తీసుకోవడానికి మూల స్థంభంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎఫ్ ఎల్‌ఓ జాతీయ అధ్యక్షురాలు సుధాశివకుమార్, నేషనల్ ఇనిషీటివ్ హెడ్ సుగుణ రవిచంద్రన్, డే చైర్‌గా ఉషారాణి మన్నెడే వ్యవహరించగా పెద్ద సంఖ్యలో ఎఫ్‌ఎల్‌ఓ సభ్యులు పాల్గొన్నారు.

డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో బుధవారం కార్పొరేటర్ పర్యటించారు. ముందుగా సాయిరామ్‌నగర్ కాలనీలో ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు సమస్య ఉందని కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో మాట్లాడి సీసీ రోడ్డు నిర్మాణ పనులకు అంచనా వేయాలన్నారు.అనంతరం బండ్లగూడలోని నేతాజీనగర్ కాలనీలో పర్యటించగా, కాలనీకి సమీపంలో ఉన్న చెరువు నీరు వర్షాలకు కాలనీలోకి వస్తున్నాయని వివరించారు. సమస్య పరిష్కరిస్తానని తఆయన హామీ ఇచ్చారు.

బీఆర్‌ఎస్ పాలనలో హామీలు ఘనం

శేరిలింగంపల్లి: బీఆర్‌ఎస్ పాలనలో హామీలు ఘనం, అమలు శూన్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రఘునాథ్‌యాదవ్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని తుల్జాభవాని ఆలయం, తారానగర్, ఓల్డ్ లింగంపల్లి ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో యాత్రను బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500లకే పేదలకు వంట గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. కేజీ టు పీజీ ఇంగ్లిష్ మీడియం విద్య, రూ.2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగులకు నెలకు రూ.4వేల చొప్పున భృతి తదితరాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

9మంది పేకాటరాయుళ్లు అరెస్ట్

హఫీజ్‌పేట్ : పేకాటరాయుళ్ళను అరెస్ట్ చేసిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ పాలవెల్లి తెలిపిన ప్రకారం..చందానగర్ పీజేఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న రాయల్ టవర్స్‌లోని ఫ్లాట్ నెంబర్ 404లో కొంత మంది పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు అక్కడకు వచ్చి పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో రాయల్ టవర్స్‌లో నివాసముండే బాలకృష్ణ (45), కార్వాన్‌కు చెందిన దినేష్ (37), సదానంద్ (39), ఛత్రినాకకు చెందిన విజయరాజు (39), ఉప్పుగూడకు చెందిన భరత్‌భూషన్ (33), చిరంజీవి (43), బడంగ్‌పేట్‌కు చెందిన కృష్ణ (38), గౌలిపురాకు చెందిన ముఖేష్ (36), సరూర్ నగర్‌కు చెందిన ఛత్రపతి (52)లను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 4,86,890 లక్షల నగదు, సెల్‌ఫోన్లు, 3 సెట్స్ ప్లెయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఓటరు లిస్టు అవకతవకలపై ఈఆర్‌ఓకు బీజేపీ ఫిర్యాదు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఓటరు లిస్టులో ఉన్న అవకతవకలపై శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ (ఈఆర్‌ఓ)కు బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఎన్నికల కమిటీ సభ్యుడు పొన్న వెంకటరమణ ,సభ్యులు మాట్లాడుతూ శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 1,35,000 డోర్ నంబర్లతో 2,90,000 ఓట్లు ఉన్నాయన్నారు. ఇందులో 186 గేటెడ్ కమ్యూనిటీలున్నాయి.ఒక ఇంటి నంబర్‌కు చెందిన ఓటరును వేరే ఓటింగ్ కేంద్రాలకు కేటాయించడంపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశామని వెంకటరమణ వివరించారు.

జేపోర్ స్టోర్ ప్రారంభం

మాదాపూర్: భారతీయ హస్తకళల వారసత్వాన్ని ప్రతిబింబించే జేపోర్ రెండవ స్టోర్‌ను బుధవారం ఇనార్బిట్‌మాల్‌లో ప్రారంభించారు. నగరవాసులను ఆకట్టుకునే విధంగా ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు. దుస్తులు, గృహాలంకరణ, నగలు తదితరాలను అందుబాటులో ఉంచారు. ఈ ఉత్పత్తులు భారతీయ వారసత్వాన్ని కలిగివుంటాయని జేపోర్ బిజినెస్ హెడ్ రష్మిశుక్ల తెలిపారు.

ఏడుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో ఏడుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఆరుమందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున, మరో వ్యక్తికి రూ.3 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం

గచ్చిబౌలి: టీ స్టాల్‌కు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సాయిలు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గుండ్లనర్వ గ్రామం, నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన లేట్ల కొండయ్య(55) నానక్‌రాంగూడలోని బిజేంద్రసింగ్ వద్ద టీ స్టాల్ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 14న ఉదయం 10 గంటలకు టీ స్టాల్‌కు వెలుతున్నానని చెప్పి వెళ్లాడు. అక్కడకు రాలేదని యజమాని చెప్పడంతో సమీప ప్రాంతాలలో వెదికినా ఆచూకీ లభ్యం కాలేదు. భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి ఆయా రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రజనీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పోలింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడతామని, పోలింగ్ స్టేషన్‌లు, ఓటరు నమోదు తదితర విషయాల్లో ఏమైనా సమస్యలు ఉంటే రాత పూర్వకంగా తెలియజేయాలని కోరారు. ఆన్‌లైన్‌లో ఓటు కోసం నమోదు చేసుకుంటే ఫొటో క్లారిటీ లేదని వందల్లో దరఖాస్తులు ఎలా రిజెక్ట్ చేస్తారని సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నించారు. డూప్లికేట్ ఓట్ల తొలగింపు, గేటెడ్ కమ్యూనిటీల్లో వెయ్యి ఓట్లు ఉన్న ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, బీఆర్‌ఎస్ నాయకులు రఘునాద్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మిద్దెల మల్లారెడ్డి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రాఘవేందర్‌రావు, బీజేపీ నాయకులు కర్చర్ల ఎల్లేష్, రాధాకృష్ణయాదవ్, సీపీఎం నాయకులు సి.శోభన్, శ్రీనివాస్, ఎంఐఎం పార్టీ నాయకులు నజీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే గాంధీని కలిసిన సంఘం సభ్యులు

హఫీజ్‌పేట్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండనగర్ కాలనీ శ్రీ విఘ్నేశ్వర శెట్టిబలిజ సంక్షేమ సంఘంకు సహాయ సహకారాలు అందిస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం శెట్టిబలిజల సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ చౌదరి, విఘ్నేశ్వర శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ ధనుంజయ్, జనరల్ సెక్రటరి పెద్దిరాజు, ట్రెజరర్ యేసు బాబు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

సంఘమిత్ర రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గం



సుదర్శన్‌నగర్‌లోని సంఘమిత్ర రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీకి ఎన్నికైన సభ్యులు

శేరిలింగంపల్లి: సుదర్శన్‌నగర్‌లోని సంఘమిత్ర రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ ఏడవ సర్వసభ్య సమావేశంను సుదర్శన్‌నగర్‌లో నిర్వహించారు. 2023-24,2024-25 వరకు రెండేళ్ల కాలపరిమితితో కూడిన సొసైటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్ష ,కార్యదర్శి డాక్టర్ ఉపేంద్రరావు, డాక్టర్ బి శ్రీనివాస్ ప్రకటించారు. సొసైటీ నూతన సలహాదారుగా ప్రొఫెసర్ ఈ హరిబాబు, గౌరవ అధ్యక్షుడుగా కె కృష్ణారెడ్డి, అధ్యక్షుడుగా డాక్టర్ ఎస్ ఉపేంద్రరావు, ఉపాధ్యక్షుడుగా జి వెంకటయ్య, కార్యదర్శిగా డాక్టర్ బి శ్రీనివాస్, కోశాధికారిగా సీహెచ్ సుధాకరరావు, ఉపకోశాధికారిగా టి కోటేశ్వరరావు, ఉప కార్యదర్శులుగా జి విష్ణురెడ్డి, బి జగదీష్, కార్యవర్గసభ్యులుగా అడ్వకేట్ వాణీమానస, బివెంకటేశ్వరరెడ్డి, పి వెంకటేశం, సీహెచ్ రాజేంద్రచారి, జిఎస్‌రెడ్డి, ఎం మచేందర్, యోగానంద్, పి వినోద్, ఎస్ శ్రీధర్‌రెడ్డి, ఏ రమేష్, పి యోగేష్‌రెడ్డి, సాంస్కృతిక కార్యదర్శిగా బి అరుణ్ కుమార్ ఎన్నికయ్యారు.

ఎట్‌హోమ్‌లో హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి



నిర్మలా సీతారామన్‌తో డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన ఇద్దరు పూర్వ విద్యార్థులు డాక్టర్ మార్కండేయ గోరంట్ల, డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి మంగళవారం రాష్ట్రపతిభవన్‌లో నిర్వహించిన 'ఎట్‌హోమ్ రిసెప్షన్'కు ఆహ్వానించారు. ఐతే వీరిలో అనివార్య కారణాలతో డాక్టర్ మార్కండేయ గోరంట్ల హాజరుకాలేదు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో సంభాషించే అరుదైన అవకాశం డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డికి లభించింది. ప్రత్యేకంగా ఆయన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో మాట్లాడారు. భవిష్యత్ వ్యవసాయ పెస్ట్ మేనేజ్‌మెంట్ పరిష్కారాలను డాక్టర్ మార్కండేయ గోరంట్ల, డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి అభివృద్ధి చేస్తున్నారు.

వాజ్‌పేయ్ ఆదర్శప్రాయుడు



ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్‌లో వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

హఫీజ్‌పేట్ : మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ వర్థంతిని పురస్కరించుకొని బుధవారం చందానగర్‌లోని ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్‌లో బీజేపీ మాజీ కన్వీనర్ అజిత్‌కుమార్ సేనాపతి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మదీనాగూడ ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మహ్మద్ యూసుఫ్, నాయకుడు కసిరెడ్డి భాస్కరరెడ్డిలు మాట్లాడుతూ వాజ్‌పేయ్ చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అలాంటి నాయకుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, నందనం వినయ, పగడాల వేణుగోపాల్, నందనం విష్ణుదత్, పార్వతి, డాక్టర్ రమేష్, జగన్ యాదవ్, పవన్ కుమార్, రాజ్ జైస్వాల్ పాల్గొన్నారు.

అమలుకాని హామీలతో మళ్లీ మోసం



ప్రజాయాత్రలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్, అనూష తదితరులు

హఫీజ్‌పేట్ : ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే గడపగడపకు బీజేపీ ప్రజాయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ అన్నారు. బుధవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో పార్టీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలు కాని హామీలతో ప్రజలను మళ్ళీ మోసం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. మౌలిక సదుపాయాల కొరత, పాడైన రోడ్లు, పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు, అంధకారంలో గ్రామ ప్రజలు నివసిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వినోద్‌రావు, అనూష మహేష్ యాదవ్, బోయిని మహేష్ యాదవ్, శ్రీధర్ గౌడ్, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసం బీసీబంధు డ్రామా



మియాపూర్‌లోని ఆర్‌బీఆర్ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

మియాపూర్: ఎన్నికల సమయంలో బీసీలను మోసం చేయడానికే బీసీ బంధు పేరుతో కేసీఆర్ మరో కుట్ర చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని ఆర్‌బీఆర్ కాంప్లెక్స్ వద్ద ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షులు నాగేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఓబీసీ నాయకులు గడీల శ్రీకాంత్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు మొవ్వ సత్యనారాయణ, సురబి రవీంద్రరావు, నాయకులు నరేష్, అసెంబ్లీ కన్వీనర్ రాఘవేందర్‌రావు హాజరై మాట్లాడుతూ బీసీలను దగా చేయడానికే బీసీ బంధు తీసుకొచ్చి కుట్ర చేస్తున్నారన్నారు. 2014లో బీసీలకు రూ.25 కోట్లు, 33 శాతం రిజర్వేషన్లు, నిరుద్యోగ యువతకు, కుల వృత్తులకు 2017-18 నుంచి 7ఏళ్లు గడుస్తున్నా ఒక్క రుణం కూడా ఇవ్వలేదన్నారు. తెలంగాణలో అధికంగా ఉన్న బీసీలు కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని, ఎన్నికల్లో ఓట్లు వేయరని భయపడి ఇప్పుడు బీసీ బంధు డ్రామా తెర లేపారన్నారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, ఓట్లకోసం ప్రస్తుతం బీసీలకు లక్ష రూపాయల పేరుతో కొన్ని కులవృత్తుల వారికే ఇచ్చి బీసీలను విభజించే కుట్ర చేస్తున్నారన్నారు. బీసీ బంధు ఇస్తే అందరికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు న్యాయం జరగాలంటే బీజేపీ ప్రభుత్వం రావాలని, బీసీలందరూ ఆలోచించి బీజేపీని గెలిపించాలని కోరారు.